23CTR 2fffff:23CTR 2fffff.qxd 9/22/2026 11:45 PM Page 1



# కుప్పాన్ని ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

### సీఎం చంద్రబాబు నాయుడు
### రైల్వే కనెక్టివిటీని మరింత పెంచుతాం.
### దాదర్ ఎక్స్ ప్రెస్ రైలుకు అదనపు స్టాప్ ఏజ్ ప్రారంభించిన సీఎం.

కుప్పం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గాన్ని ఎకనామిక్ గా హబ్ గా మార్చనున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సోమవారం రాత్రి 10.40 గంటల ప్రాంతంలో దాదర్ ఎక్స్ ప్రెస్ రైలుకు అదనపు స్టాపేజ్ ను సీఎం చంద్రబాబు నాయుడు జండా ఊపి ప్రారంభించారు. అనంతరం 11.30 గంటలకు మీడియాతో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ప్రస్తుతం కుప్పం మీదుగా 98 ట్రైన్లు నడుస్తున్నాయని వీటిలో 59 రైళ్లకు స్టాపింగ్ ఉందన్నారు. మున్ముందు మరిన్ని రైళ్లకు స్టాపింగును కేటాయించేలా కేంద్ర రైల్వే శాఖ మంత్రి తో చర్చిస్తామన్నారు. కుప్పాన్ని అన్ని ప్రాంతాలతో కనెక్టివిటీ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కుప్పం నియోజకవర్గంలోని గుడిపల్లి లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి భూసేకరణ నిమిత్తం రైల్వే అధికారులతో చర్చించామన్నారు. అలాగే మలనూరు వద్ద సైతం ఆర్‌ఓబి నిర్మించనున్నట్లు తెలిపారు. కుప్పం సమీపం డీకే పల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. కొత్తపేట పాతపేటను కలిపే విధంగా



స్కైవాక్ ను రైల్వే శాఖ మంజూరు చేసిందన్నారు. పొగరుపల్లి వద్ద డ్రై పోర్ట్ ఏర్పాటు చేస్తున్నామని అక్కడికి సైతం జాతీయ రహదారులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం పేర్కొన్నారు. మున్ముందు కుప్పంలో కార్గో రైళ్ల సైతం తిరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు



కుప్పం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త.

కుప్పం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ప్రశాంత్ దంపతులను సీఎం చంద్రబాబు నాయుడు ఆశీర్వదించారు. సోమవారం ప్రశాంత్ వివాహం కుప్పంలో జరిగింది .సోమవారం రాత్రి సీఎం చంద్రబాబు నాయుడు ప్రశాంత్ నివాస గృహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి పెళ్ళికానుకను అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు .

## ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



గుడిపాల, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత సిఎం నందమూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటుకు మండలంలోని ప్రధాన కూడళ్ళలో జిజిఎం ట్రస్ట్ ఛైర్మన్ చెన్నకేశవులు నాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు కోసం మండలంలోని బొమ్మసముద్రం, పల్లూరు, ఎగువ పిళ్ళారికుప్పం, పేయనపల్లి తదితర ప్రధాన కూడళ్ళలో స్థలాలను పరిశీలించడం జరిగిందన్నారు. స్థలం ఖరారు చేసిన అనంతరం త్వరలోనే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, దేశం నాయకులు రవినాయుడు, రఘునాధనాయుడు, జయచంద్ర, మురారి, కన్నయ్య, మార్కొండ యాదవ్, శంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక టెట్‌లో మార్పులు

### - రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ప్రత్యేక టెట్‌లో తగు మార్పులు చేయాలని రాష్ట్ర వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న సబ్జెక్టులు కాకుండా ఇతర సబ్జెక్టులతో టెట్ పరీక్ష నిర్వహించడంతో వారు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని మండి పడ్డారు. ఉపాధ్యాయుల గొంతుపై కత్తిలా మారిన టెట్ అర్హత పట్ల కూటమి ప్రభుత్వం చెప్తున్న స్పెషల్ టెట్‌లో ఉపాధ్యాయులకు ఉపయోగపడు స్పెషల్ ఏమీ లేదన్నారు. ఇది చెప్పి ప్రభుత్వం ఉపాధ్యాయులను కేవలం మభ్యపెట్టడం చేస్తోందన్నారు. ఉత్తీర్ణత మార్కులు అందరికీ 40 శాతంతో అందరికీ ఒకే విధంగా వుండాలని ప్రాతినిధ్యం చేసినప్పటికీ దీనిని పరిగణనలోకి తీసుకోకుండా పాత పద్దతిలోనే స్పెషల్ టెట్ నిర్వహించడం సబబు కాదన్నారు. అందరికీ ఒకే ప్రశ్నాపత్రం అయితే ఉత్తీర్ణతలో తేడాలను తేవడంను ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారని, అందరికీ సమ న్యాయం చేయాలని కోరారు. అలాగే సిలబస్‌లో మార్పులు, అర్హత ప్రమాణాలపై కూటమి ప్రభుత్వం సమీక్షించాలని డిమాండ్ చేశారు.

## ఓటర్ల జాబితా విడుదల చేసిన కమీషనర్

చిత్తూరు, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు సంబంధించిన ఓటర్ల జాబితాను మున్సిపల్ కమీషనర్ నరసింహాప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటించి నోటీసు బోర్డుల్లో వుంచారు. అలాగే డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాను తహసిల్దారు కార్యాలయం, అర్డీఓ కార్యాలయం, కలెక్టరేట్‌లో అందుబాటులో వుంచినట్లు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ పేర్కొన్నారు. అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాను అందించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శుభప్రద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఆదిదంపతుల బిక్షాటన



కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం జరిగిన స్వామివారి తిరుకళ్యాణం సందర్భంగా ఆది దంపతులైన శివపార్వతులు కాణిపాకం పురవీధుల్లో బిక్షాటన సాగించారు. తమ కుమారుడైన గణనాధుని తిరుకళ్యాణంకు కావలసిన ధన, కనక,వస్తు సామాగ్రిని సమకూర్చుకోవడానికి తల్లిదండ్రులైన శివపార్వతులిద్దరూ కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన చేయడం ఆనవాయితీ. ఈమేరకు మణికంఠేశ్వరాలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుని కళ్యాణానికి కావలసిన ధన, కనక, వస్తువులను అందించాలని కోరుతూ కాణిపాకం పురవీధుల్లో భిక్షాటన సాగించారు. ఈమేరకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, మాజీ ఛైర్మన్ జగన్నాధరెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లీలా సుధీర్, ఆలయ అధికారులు, ఉభయదారులు కాణిపాకం పురవీధుల్లో బిక్షాటన చేశారు. ఈసందర్భంగా భక్తులు తమవంతు విరాళాలను స్వామివారి కళ్యాణానికి అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## గురువులపై దాడి వైకాపా పైసాచికత్వానికి నిదర్శనం

### మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాజూరు బాలాజీ

చిత్తూరు, సెప్టెంబర్ 22( ప్రభాతవార్త):

సమాజానికి దేశం చేసే ఉపాధ్యాయులపై దాడి చేయడం వైకాపా పైసాచికత్వం, అరాచక పాలన మనస్తత్వంకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గాజులు బాలాజీ పేర్కొన్నారు. విజయవాడలో ఉపాధ్యాయులపై సోమవారం జరిగిన భౌతిక దాడులను నిరసిస్తూ మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్య నేర్పిన గురువులపై విధ్వంస దాడులకు తెగపడటం గొడ్డలి పార్టీ అరాచక సంస్కృతికి అద్దం పడుతుందన్నారు. హక్కులపై ప్రశ్నించిన ఉపాధ్యాయులపై రౌడీ మూకలతో దాడి చేయించడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడే కాదు ప్రతిపక్షంలోకి వచ్చిన వైకాపా నేతల రౌడీయిజం, గుండాయిజం ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులపై వై కాపానుసరించిన తీరు ఆక్షేపనీయమన్నారు. గురువులను అవమానించిన ఏ వ్యవస్థ మనుగడ సాగించలేదని, వైకాపా ఈ దాడులకు భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు అన్నారు.

## కాణిపాకంలో ఛైర్మన్, ఈఓలు ఆకస్మిక తనిఖీలు

కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:



కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం కాణిపాకం ఆలయంలో మంగళవారం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను, గణేష్‌దీక్షా హోమ మండపంను, లడ్డూ తయారీ పోటు నందు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య శిబిరంలో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరై భక్తులకు మెరుగైన సేవలు అందిచాలని, సూచించారు. లడ్డూ పోటులో పరిశుభ్రత సక్రమంగా నిర్వహించాలని,నాణ్యత తగ్గకుండా చూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాలకమండలి సభ్యులు సుబ్బారెడ్డి, ఏఈఓ ఎస్వీ,కృష్ణారెడ్డి, సూపరెండెంట్ దివాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గణనాధునికి టీటీడీ తరపున పట్టువస్త్రసాల సమర్పణ



కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం జరిగిన స్వామివారి తిరుకళ్యాణం సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత స్వామివార్లకు టీటీడీ తరపున నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. ఈమేరకు టీటీడీ డిప్యూటీ ఈఓ బి.భాస్కర్, అర్చకులు వేదపండితులు కాణిపాకం చేరుకుని పట్టువస్త్రాలను స్థానిక దేవస్థానం అతిథిగృహం నుండి మంగళవాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. నూతనపట్టు వస్త్రాలను తీసుకువచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను స్వామివారి ఎదుట వుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో టీటీడీ, కాణిపాకం ఆలయ అధికారులు, అర్చకులు వేపండితులు పాల్గొన్నారు.

### గణనాధుని సేవలో టీటీడీ డిప్యూటీ ఈఓ

టీటీడీ డిప్యూటీ ఈఓ బి.భాస్కర్ మంగళవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి తిరుకళ్యాణం సందర ్భంగా టీటీడీ తరపున పట్టు వస్త్రాలను సమర్పించిన అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను,చిత్రపటాన్ని, ప్రసాదాలను అందచేశారు. వారి వెంట ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## కడపజిల్లా కిసాన్‌మోర్చా ఇన్‌చార్జిగా శ్రీధర్ చౌదరి నియామకం



ఐరాల, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

కడప జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా మండలకు చెందిన వి.శ్రీదర్ చౌదరి నియమితులయ్యారు. మండలంలోని కామినాయనిపల్లె గ్రామపంచాయతీ కస్తూరినాయనిపల్లెకు చెందిన ఆయన బిజెపీ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. దీనితో పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగా కడప జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు వీలుగా శ్రీధర్ చౌదరిని ఆ జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా నియమిస్తూ ఆపార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఉత్వర్వులు జారీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై వుంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా కడప జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




కాణిపాకం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం జరిగిన అశ్వవాహనసేవ, తిరుకళ్యాణం సందర ్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి. ఈమేరకు స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి గంటలవరకు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తిరంజని, హరికథలు, కూచిపూడి, భరతనాట్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు, కోలాటాలు,చెక్కభజనలు వంటి కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. దీనితో పాటు ఉదయం వణిగ, బలిజ వంశస్థులచే వేర్వేరుగా జరిగిన అష్టోత్తర కలశాల ఊరేగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన వాయిద్యాలు, కోలాటాలు, డ్రమ్స్, విచిత్ర వేషధారణలు, భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## కాణిపాకంలో నేడు (బుధవారం)

సాయంత్రం : ధ్వజావరోహణం
ఉభయదారులు: దేవస్థానం వారిచే.
సాయంత్రం : అభిషేకం, వడాయత్తు ఉత్సవం
ఉభయదారులు : కీ॥శే॥ శ్రీ గాలి ఉమాపతి నాయుడు, కాకర్లవారిపల్లె.
రాత్రి : ఏకాంతసేవ
ఉభయదారులు: కీ॥శే॥శ్రీకె.సోమశేఖరరెడ్డి వారి జ్ఞాపకార్థం వారి కుమారులు, కాణిపాకం.

ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు : ఉదయం 10 గంటల నుండి అర్ధరాత్రి 1 గంటల వరకు రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులచే ప్రవచనములు, భక్తి రంజని, హరికథలు, భరతనాట్యం, కూచిపూడి, వీధి నాటకములు, గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి పలు బృందాలచే కోలాటాలు, చెక్కభజనలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు.

## యానాది కుటుంబానికి ప్రభుత్వ సాయం

పెద్దపంజాణి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త.



వర్షాల కారణంగా ఇల్లు కూలిపోయి నష్టపోయిన యానాది కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. మంగళవారం తహసీల్దార్ రామ్మూర్తి బాధిత కుటుంబానికి రూ.25 వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. మండలంలోని కోగిలేరు సమీపంలో గతంలో యానాదులకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేసింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేకపోవడంతో నిర్మించిన ఇళ్లు నాణ్యత లోపాలతో వర్షాలకు దెబ్బతిన్నాయని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో యానాది కాలనీకి చెందిన వీరప్ప ఇల్లు రెండ్రోజుల క్రితం కూలిపోయింది. అయితే ఇల్లు కూలే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన వీరప్ప బయట పాక వేసుకుని నిద్రించడంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రామ్మూర్తి ఘటనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి సాయం అందించారు. కార్యక్రమంలో వీఆర్వోలు సుజాత, శివ, మాజీ సర్పంచులు మురహరిరెడ్డి, శివయ్య, నాయకులు నాగేశ్వరరావు, మంజునాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మెరుగైన పారిశుధ్యం లక్ష్యం

గుడిపాల, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:



గ్రామాల్లో మెరుగైన పారిశుధ్యం నెలకొల్పడమే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి పీఎంఎజీవై కింద మంజూరైన ఈ-ఆటోలను మరకాలకుప్పం, 189 కొత్తపల్లి గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దడానికి పంచాయతీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిజిఎం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గురజాల చెన్నకేశవులు నాయుడు, ఎంపిడిఓ శిరీష, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, ఎఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పిఎపై అసత్య ఆరోపణలు

### - బిసి యాదవ సంఘ నేతలు



గుడిపాల, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిఎ కుమారస్వామిపై చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంసి విజయానందరెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని బిసీ యాదవ సంఘ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్ ఆవరణలో మంగళవారం బిసీ యాదవ సంఘ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ బిసీలకు చెందిన ఓ చిరుద్యోగి అక్రమ క్వారీ నిర్వహిస్తున్నాడని వైకాపా నాయకులు ఎంసి విజయానందరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. వైకాపా పార్టీకి బిసీలు అంటే చులకన అయ్యిందని, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే పిఎపై సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలకు పాల్పడటం వైకాపాకు పద్ధతి కాదన్నారు. వైకాపా నాయకులు ప్రత్యర్థి పార్టీ నాయకులపై బురద చల్లడం వీడి జరుగుతున్న అభివృద్ధి పనులకు సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసీ నాయకులు చిట్టిబాబు యాదవ్, వెంకటేశులు, స్వరూప్ యాదవ్, నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు మున్సిపాల్టీ అభివృద్దే లక్ష్యం

### రూ.25 కోట్లతో మౌలిక సదుపాయలు. ఎంఎల్ ఏ అమరనాధరెడ్డి

పలమనేరు. సెప్టెంబర్ 22. ప్రభాతవార్త:



పలమనేరు మున్సిపాల్టీ అభివృద్దే లక్ష్యమని హెచ్ ఏ ఎం ద్వారా రూ.25 కోట్లతో మౌలిక సదుపాయలు కల్పిస్తామని ఎంఎల్ ఏ అమరనాధరెడ్డి అన్నారు. మంగళవారం ఇందుకు సంబంధించి మున్సిపల్ కార్యాలయం వద్ద శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పలమనేరు మండలానికి వివిధ అభివృద్ధి పనులకు రూ 120 కోట్లు కేటాయించిందని ఇందులో 25 కోట్లు మున్సిపాలిటీకి ఖర్చు చేస్తామని తెలిపారు. ఈ నిధులతో రోడ్లు. మురుగునీటి కాలువలు. వీధి దీపాలు ఇతర సదుపాయాలు వందశాతం పూర్తి చేస్తామని వివరించారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలో పలమనేరు మండలంలో రూ 45 కోట్లతో పనులు జరుగుతున్నాయని మరో రూ.18 కోట్లతో టెండర్లు పూర్తి చేశామన్నారు. 6 నెలల క్రితం రూ. 5 కోట్లతో ఇంటర్నల్ రోడ్లు పనుల్లో కొన్ని ప్రారంభోత్స వాలు. కొన్ని శంఖు స్థాపనలు పూర్తి చేశామని తెలిపారు. పలమనేరు పెద్ద చెరువు ప్రక్షాళనకు మురుగు నీరు శుద్ధి చేయడానికి 2.25 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా ఏవైనా అవసరమైన పనులు ఉంటే తెలియజేయాలని. వెంటనే నిధులు మంజూరు చేస్తామని. పలమనేరును ఆధునీకరణతో అతి సుందరంగా తీర్చి దిద్దడం ప్రతి ఇంటికి శుద్ద మైన నీటి నీ అందించడమే లక్ష్యమని తెలిపారు. కమీషనర్ లోకేష్ వర్మ. తెలుగు దేశం నాయకులు పాల్గొన్నారు.

## తప్పిన ప్రమాదం.. కూలిన విద్యుత్ స్థంభాలు

కుప్పం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త

స్థానిక ప్యాలెస్ రోడ్డులోమంగళవారం పెను ప్రమాదం తప్పింది. డ్రైనేజీల నిర్మాణం కోసం వికాస్ జూనియర్ కాలేజ్ ఎదుట ఉన్న వీధుల్లో జెసిబితో పనులు చేపట్టారు. ఇదే సమయంలో విద్యుత్ స్థంభాలు రెండు విరిగి కూలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ సైతం భారీ శబ్దంతో కాలువలో పడగా ఒక్కసారిగా షార్ట్ సరా క్యూట్ సంభవించింది. విద్యుత్ తీగలు రోడ్లపై పడడంతో జనం ఆందోళన చెందారు. ఎవరూ ఆసమయంలో రోడ్డు సమీపంలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం రెస్కో అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా నిలిపేశారు. విరిగిన విద్యుత్ స్థంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేశారు. దీంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

